మినీ కథ

# కాకులు

## పోలాప్రగడ జనార్దనరావు

రోడ్డు మీద నడుస్తున్న మనిషి ఉన్నట్టుండి ధభీమని పడిపోయాడు. చుట్టు పక్కల షాపుల దగ్గర సరుకులు కొనుక్కోవడానికి వచ్చిన వాళ్ళు, బస్సుస్టాండులో నుంచున్న బాపతు, కిళ్ళీ కొట్టు దగ్గరున్న కులాసారాయుళ్ళు, మోళీవాడి చుట్టూ గుమిగూడినట్టూ వేలంపాటవాడి దగ్గర వేలం వెర్రిగా చేరిన జనంలా పడిపోయినతనికి చుట్టూ మూగారు

"అరెరె మూర్ఛరోగం అనుకుంటా. చూస్తారేమిటండి నీళ్ళు పట్టుకురండి తొందరగా—తాళం చేతులున్నాయా ఎవరిదగ్గరేనా?" అంటూ ధన్వంతరి వేలు విడిన మేనమామలా దగ్గుతూ ఆయాస పడుతూ హడావిడి చేసాడు ఒక రోగిష్ఠి ముసలాయన.

"ఈ.......... అలవాటేలెండి. ఏ జేబో కొట్టి నాలాంటోడ్ని సూసి పరిగెట్టబోయి పడుంటాడు. నాటకాల నా........నాలు గంటించి నానంటే ఈడు, ఈడి బాబు, ఈడి పామిలీ టీలు మొత్తం అంతా మన వెంకాల పాలోఅవుద్ది. ఆపాలి ఏం జరిగిందంటేవూ... ఆ సరిగ్గా బిఫోర్ లాస్టి యీరు యిల్లాంటి నాకొడుకే" అంటూ ఫ్లాష్‌బాక్ మొదలెట్టాడు అక్కడున్న జనాన్ని క్లియర్ చేసి ట్రాఫిక్ ఆగకుండా చూడాలన్న జ్ఞానం కూడా లేని పోలీస్ కానిస్టేబుల్.

"కంటిన్యూగా ఒకే బ్రాండ్ ఎంత తాగినా పరవాలేదు గురూ! బచ్చాగాళ్ళు, తెలీక అదికాస్త ఇదికాస్త అంటూ కక్కుర్తి పడతారు; పడిపోతారు — నాబోటి గాడి దగ్గరకొచ్చి "గురూ ఇదీ సంగతి" అంటే వాడికి పారం చేర్పినట్టు వుంటుంది. నాకూ ఒకరోజు గడిచిపోయేది కదా!... ఛీ ఛీ ఎప్పటికి బాగుపడతారో ఏమిటో"

"ఏమిటండి ప్రతి వాడు పడిపోయిన వాడి గురించి యిష్టమొచ్చినట్లు మాట్లాడేవారే. సాటి మనిషి పడిపోతే సాయం చేయరు సరికదా, యిష్ట మొచ్చినట్టు అభాండలు వేస్తారా? ఇదేనా మీ సంస్కారం? ఇదేనా మీ సంస్కృతి? అదే మీ తమ్ముడో మీ బావో అయితే అల్లా అనగలరా? మీకు యిటు వంటి రోజు వస్తే ఏం చేస్తారు? నాన్న యింకా యింటికి రాలేదు అని ఎదురు చూసే అతని పిల్లలు గురించి ఆలోచించారా?" అంటూ విపరీతమైన ఆంగికాభినయంతో నాటకం డైలాగుల్తో చుట్టూ గుమిగూడిన మనుష్లో అటు యిటు తిరుగుతూ అంతర్ధానమయ్యాడు ఆ యువకుడు... (ఒకటి రెండు పర్సులతో)

జనం గుమిగూడి వుంటే నాలుగు డబ్బులు దొరుకుతాయేమోనని సొట్టలు పడ్డ సత్తుగిన్నెతో సత్తువలేని బక్క చిక్కిన ముసలాడొచ్చాడు అక్కడికి. "అడుక్కోవడానికి అభిమానపడ్డ మొచ్చినట్టుంది బిడ్డకి, పడిపోయాడు తిండిదొరక్క - జీవా ముక్తికి మార్గమును కనలేవా" అంటూ పాడుకుంటూ అడుక్కోవడానికి వెళ్ళిపోయాడు.

"గుమిగూడిన జనంలో కనీసం మూడొం

తులు ఓటర్లు వుంటారు. ఏక్సిడెంటు అయి వుంటే పోలీసు రిపోర్టు యిచ్చి చచ్చిపోయి నాడింటికెళ్ళి వాళ్ళ వాళ్ళకి చెప్పి తనే దహన క్రియలు జరిపించాలి. (అన్నట్టు ఫొటోగ్రాఫర్‌ని పిలవడం మర్చిపోకూడదు) అతని భార్యకి సాయం చెయ్యాలి...అదీ కాకపోతే ఒకవేళ కొట్టుకున్నారేమో... ఈ గొడవకి కారణం తన ఎగస్‌పార్టీ వాళ్ళ మీదకి బనాయించాలి. దెబ్బలు తిన్నవాడు ఎవరైనా సరే తన కుడిభుజం క్రింద ప్రకటించాలి. ఒకవేళ పెద్ద గుండాగాడై వుంటే మొన్న మీటింగ్‌లో తనమీద రాళ్ళు యిసిరించిన వాళ్ళ మీటింగులో ఈడిచేత సోడా బుడ్డిలు యిసిరించాలి ...ఒకవేళ దెబ్బతిన్న వాడు నిరుద్యోగి అయితే నిరుద్యోగ కరువు భత్యం గురించి కడుపు మండి వున్నాడు కాబట్టి కాస్త కాఫీనీళ్ళు పోయిస్తే ఆడే గోడలు కరాబు చేస్తాడు"...ఇలా ఆలోచిస్తూ జనం దగ్గరకి చేరుకున్నాడు ఓమాజీ రాజకీయ నాయకుడు....

జనం మాట్లాడుకోవడం తప్ప కనీసం తనకి ఎవ్వరూ చేయూతని ఇవ్వలేకపోవడం అప్పుడే కాస్త స్పృహలోకి వస్తున్న అతను గ్రహించాడు. మెల్లిగా తనంతట తానే లేచాడు.

"జీవం" లేని నువ్వు జీవం వున్న వాళ్ళ కంటే ఎన్నో రెట్లు గొప్పదానవు. రోడ్డు మీద ఆలోచిస్తూ నడువ కూడదని, అల్లా నడవడం ఎన్నో అనర్థాలకి దారి తీస్తుందనీ నాకు గుణపాఠం నేర్పావు. నువ్వు దాచుకున్న దాన్ని నాకుకొని నిన్ను నిర్దయగా రోడ్డుమీద పారేస్తే మరి పారేసిన వాడి నాళ్ళు లాగడం నీధర్మం....థాంక్యూ వెరీ మచ్" అనుకుంటూ అందరి వంకా చూసి, కాలి క్రింద పడున్న అరటిపండు తొక్కని జాగ్రత్తగా పక్కనున్న కాలవలోకి విసిరేసి సవ్యంగా వున్న ఒక్క కాలుని జాడించుకొని కుంటుకుంటూ వెళ్ళిపోయాడు అతను.


100 ml బాటిలు కొని

**87 పైసలు ఆదా చేసుకోండి**

# 'క్రివేణి' ఇంకు




ఇప్పుడు లాభకరమైన ప్యాకింగులో
100ml పాలిథీన్ బాటిల్స్‌లో దొరుకుతున్నది.
100ml బాటిలు 1కి వెల రు. 2-80
60ml బాటిలు 1కి వెల రు. 2-20
(స్థానిక పన్నులు అదనం)
వినియోగదార్ల లాభమునకుగాను ప్రకటించుచున్నాము.
తయారు చేయువారు :

కృష్ణవేణి ఇంకు ఫ్యాక్టరీ

751, తిరువత్తియూరు హైరోడ్, మద్రాసు-600081